క్లుప్తంగా

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



పెదపూడిలో పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకుంటున్న ఆర్వో మాధురి

పెదపూడి: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి అల్లర్లు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని నియోజకవర్గ ఆర్వో, గెయిల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.మాధురి సూచించారు. పెదపూడి, కాండ్రేగుల, జి.మామిడాడ గ్రామాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఆమె, ఎస్సై శోభన్‌కుమార్ పరిశీలించారు. అక్కడ సౌకర్యాలను చూశారు. మండలంలోని సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలను గుర్తించి, అక్కడ ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలు చోటుచేసుకోకుండా చూడాలని పోలీసులకు ఆమె సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ కృష్ణకుమారి, ఆర్‌ఐ ఎం.త్రివేణి, బీఎల్వోలు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యం దిశగా సాగాలి



బిక్కవోలులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఈస్ట్‌జోన్ డీఎస్పీ కిశోర్‌కుమార్

బిక్కవోలు: విద్యార్థులు ఉన్నత లక్ష్యం దిశగా ముందుకు సాగాలని రాజమహేంద్రవరం ఈస్ట్ జోన్ డీఎస్పీ ఎం.కిశోర్‌కుమార్ అన్నారు. గురువారం బిక్కవోలు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల బాలికలు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలన్నారు. గంజాయి వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ క్రైమ్, క్రికెట్ బెట్టింగ్, లోన్‌యాప్ తదితర విషయాల్లో తల్లిదండ్రులు మోసపోకుండా అప్రమత్తం చేయాలన్నారు. ట్రైనీ డీఎస్పీ భానోదయ, అనపర్తి సీఐ పి.శివగణేష్, ఎస్సై పి.బుజ్జిబాబు, ఇన్‌చార్జి హెచ్‌ఎం జంగా సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ జ్యోతి

పెదపూడి: బాల్య వివాహాలతో అనర్థాలు చోటుచేసుకుంటాయని కాకినాడ సీడీపీఓ ఎ.జ్యోతి తెలిపారు. గురువారం సంపరలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో తల్లులు, బాల బాలికలకు బేటీ బచావో బేటీ పఢావో (బాలికలను రక్షిద్దాం.. బాలికలను చదివిద్దాం) కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ లింగ వివక్ష, సమాన హక్కులు, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్లపై వివరించారు. అనంతరం భర్త చనిపోయి ఇద్దరు ఆడ పిల్లలను చదివించుకుంటున్న అనిత, వరలక్ష్మిలను సన్మానించారు. ఏపీఎస్‌సీపీసీఆర్ కమిటీ మెంబర్ ఆదిలక్ష్మి, ఎంఈఓ-2 సీవీవీ సత్యనారాయణ, సూపర్‌వైజర్ పద్మావతి, హెచ్‌ఎం త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

4 వేల పెన్నులతో వాగ్దేవికి ప్రత్యేక పూజలు



పసుపు, కుంకుమతో మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజ

సీటీఆర్‌ఐ: వాగ్దేవికి 4 వేల పెన్నులతో ప్రత్యేక పూజలు నిర్వహించామని, వాటిని పది, ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులకు అమ్మవారి ప్రసాదంగా పంపిణీ చేస్తామని శ్రీ మహాలక్ష్మీ సమేత చిన్న వేంకటేశ్వరస్వామి పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు స్వామీజీ అన్నారు. గాడాలలోని పీఠంలో గురువారం ప్రత్యేక పూజల నిర్వహించారు. 560 కేజీల పసుపు, కుంకుమలతో మహాలక్ష్మి, దుర్గమ్మకు సామూహిక మహా అర్చన నిర్వహించారు. స్వామీజీ మాట్లాడుతూ మహాలక్ష్మీ దేవిని స్మరించడం వల్ల అష్టైశ్వర్యాలు, దుర్గమ్మను పూజిస్తే శత్రుభయం నశించి, సర్వ ఫలాలు కలుగుతాయన్నారు. అమ్మవారికి పూజ చేసిన పసుపు, కుంకుమను గడపగడపకూ పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో మనగుడి – మనసేవ భారతీయ ఆధ్యాత్మిక సేవాసమితి జాతీయ చైర్మన్ ధరణి కోట వెంకట హేమవతి, జాతీయ గౌరవాధ్యక్షుడు అంబటి గురుమూర్తి, జాతీయ కార్యదర్శి మద్ది శ్రీనివాసరెడ్డి, ఉభయ రాష్ట్రాల చైర్మన్ మతల రమేష్, వీర అప్పారావు, అంబటి శ్రీనివాసరావు, సర్దార్ సుమేధ, గుబ్బల గంగాభవాని, ముదునూరు వెంకటలక్ష్మి, గ్రంధి విజయలక్ష్మి, రేణుక రామలక్ష్మి, పూర్ణిమ, నరసింహ పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణకు అగ్రాసనం

- గ్రామాల్లో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు
- ఆసక్తి చూపుతున్న ప్రజలు



కోటికేశవరంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్



శ్రీరంగపట్నంలోని ఓపెన్ జిమ్

మధురపూడి: నేటి ఉరుకులు, పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరూ ఉదయం నుంచి రాత్రి వరకూ బిజీగా గడిపేస్తున్నారు. సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా ఆరోగ్యం విషయంలో మాత్రం కొంచెం శ్రద్ధ చూపడం లేదనే చెప్పాలి. ముఖ్యంగా వ్యాయామం అనే విషయాన్ని చాలామంది మర్చిపోయారు. నిత్యం వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యం బాగుంటుందని, మానసిక ఉత్సాహం ఉంటుందని తెలిసినా, ఆచరణలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజల ఆరోగ్య సంరక్షణకు దృష్టి సారించింది. గ్రామాల్లో వైద్య శిబిరాలు, ఆస్పత్రిలో మెరుగైన వసతులు కల్పించింది. పీహెచ్‌సీలో సిబ్బంది కొరత లేకుండా చర్యలు చేపట్టింది. వీటితో పాటు ప్రజలు వ్యాయామం చేసుకునేందుకు వీలుగా గ్రామాల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేసింది.

మూడు మండలాల్లోనూ..

రాజానగరం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 15 ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేసింది. వీటికి రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) సహకారం అందించింది. నియోజకవర్గంలో అధిక సంఖ్యలో వ్యాయామ శాలలను ఏర్పాటు చేయడంలో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఎంతో కృషి చేశారు. ప్రస్తుతం వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాయామం చేస్తున్నారు. కోరుకొండ మండలం మధురపూడి, కోటి కేశవరం, గాడాల, సీతానగరం మండలం వెదుళ్లపల్లి, బొబ్బిల్లంక, సీతానగరం, రాజానగరం మండలం నరేంద్ర పురం, తోకాడ, లాలాచెరువుల్లో ఇటీవల ఏర్పాటు చేశారు. గతంలోనే మూడు గ్రామాల్లో నెలకొల్పారు.

ఒక్కో జిమ్‌లో 13 వ్యాయామ పరికరాలు

ప్రతి జిమ్‌లో 13 రకాల వ్యాయామ పరికరాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా శరీరంలో అన్ని అవయవాలకు వ్యాయామం లభిస్తుంది. అలాగే ఒక్కో వ్యాయామశాలకు రూ.25 లక్షలు కేటాయించారు. చుట్టూ ఫెన్సింగ్, గ్రీనరీ నెలకొల్పారు. రాత్రి వేళల్లో సైతం వ్యాయామం చేసుకునేందుకు సౌలభ్యంగా విద్యుత్ సదుపాయం కల్పించారు. సోలార్ లైట్లు ఏర్పాటు చేయడంతో స్థానిక సంస్థలపై ఆర్థిక భారం పడకుండా చర్యలు తీసుకున్నారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యం



ప్రజల ఆరోగ్యం విషయాన్ని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. సీఎం జగన్ మాత్రం ఎంతో ప్రాధాన్యత ఇస్తూ అన్ని చర్యలూ చేపడుతున్నారు. యువతకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఓపెన్ జిమ్‌లపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

– నక్కా రాంబాబు, ఏఎంసీ చైర్మన్

సంపూర్ణ ఆరోగ్యం



నిత్యం వ్యాయామం చేయడం ద్వారా శారీరక, మానసిక ప్రశాంతత కలుగుతుంది. యువత దురలవాట్లకు దూరంగా ఉంటారు. పల్లెల్లో ప్రశాంత వాతావరణం నెలకొంటోంది. జగన్ పాలనలో గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయి.

– కంటే వినయ్ తేజ, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు

జగన్ పాలనలో రాష్ట్ర అభివృద్ధి



జి.యర్రంపాలెంలో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



కొండగుంటూరులో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజా

- రాజానగరం నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఉత్సాహంగా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన

రాజానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందని, రాజానగరం నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు తీస్తోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. రాజానగరం మండలంలోని వివిధ గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.1.85 కోట్లతో నిర్మించిన నాలుగు ఓవర్ హెడ్‌ట్యాంకులను గురువారం ఆయన ప్రారంభించారు. అలాగే ముక్కినాడ, మల్లంపూడి గ్రామాల్లో రూ. 46 లక్షలతో నిర్మించనున్న ఓవర్ హెడ్ ట్యాంకులకు శంకుస్థాపన చేశారు. ముక్కినాడలో ఎస్సీ కమ్యూనిటీ హాలు, బల్క్ మిల్క్ చిల్లింగ్ యూనిట్ ప్రారంభోత్సవం జరిగింది. మల్లంపూడిలో రూ.20.8 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లీనిక్ ప్రారంభించారు.

ప్రజలకు నేరుగా పథకాలు

ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ సచివాలయం, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజలకు ప్రభుత్వ పథకాలు నేరుగా అందుతున్నాయన్నారు. వేసవిలో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా ఉండేందుకు ముందుగానే జలజీవన్ మిషన్ ద్వారా పలు నిర్మాణాలు చేపట్టినట్టు తెలిపారు. ఈ పథకంలో భాగంగా 76 ఓవర్ హెడ్ ట్యాంకులకు గాను 65 ట్యాంకులు పూర్తయ్యాయని, మరో 11 ట్యాంకులు నిర్మాణ దశలో ఉన్నట్టు తెలిపారు. నియోజకవర్గంలో రూ. 1,158 కోట్లతో అభివృద్ధి, మరో రూ. 1,142 కోట్లతో సంక్షేమ పథకాలను అమలు జరిపినట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ దూలం పెద్ద, జెడ్పీటీసీ వాసంశెట్టి పెద్ద వెంకన్న, పార్టీ నాయకులు మందారపు వీర్రాజు, గండి నాని, వేమగిరి కృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 60 కుటుంబాల చేరిక

రాజానగరం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీలోకి వలసల పర్వం కొనసాగుతోందని, దీంతో ప్రతిపక్షాలన్నీ బేజారవుతున్నాయని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా అన్నారు. రాజానగరం మండలం జి.యర్రంపాలెంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీకి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఉప్పలపాటి శ్రీనివాస వెంకట నరసింహరాజు ఆధ్వర్యంలో 60 కుటుంబాలు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ప్రజల మద్దతు పెరుగుతోందన్నారు. కష్టపడి పనిచేసే వారికి వైఎస్సార్ సీపీలో ఎల్లప్పుడూ మంచి గుర్తింపు ఉంటుందన్నారు. గత ప్రభుత్వాల తరహా కాకుండా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు ఇంటికి చేరుతున్నాయన్నారు. ముందెన్నడూ జరగని, ఎవ్వరూ చేయలేని కార్యక్రమాన్ని ఈ ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. రానున్న రోజుల్లో ఈ చేరికలు మరింతగా పెరుగుతాయన్నారు. ప్రతిపక్ష పార్టీలు వారి కార్యాలయాలకు తాళాలు వేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు.

250 మందికి ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ

పేదలందరికీ సొంతిళ్లు సమకూర్చాలనే లక్ష్యంతో జగనన్న ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. గురువారం రాజానగరం మండలం కొండగుంటూరులో 69 మందికి, జి.యర్రంపాలెంలో 119 మందికి, కొత్త తుంగపాడులో 62 మందికి ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. రాజా మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో ఇంటి స్థలాన్ని కేటాయిస్తున్న ఏకైక ప్రభుత్వమిదే అన్నారు. గత పాలకులు పేద వర్గాలను మోసం చేశాయని, ఈ ప్రభుత్వం పేదల పక్షపాతిగా నిలిచిందన్నారు. రాజానగరం నియోజకవర్గంలో 20 వేలమందికి పట్టాలిచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పార్వతీ సమేత రామలింగేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠ



తొస్సిపూడిలో విగ్రహాల ప్రతిష్ఠ పూజల్లో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు



వడిశలేరులో భజేనారాయణస్వామి సదస్యం తిలకిస్తున్న భక్తులు

బిక్కవోలు: తొస్సిపూడి గ్రామంలో రూ.కోటితో పునర్నిర్మించిన పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ గురువారం అట్టహాసంగా జరిగింది. దీనికి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై పూజలు చేశారు. పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి, సిద్ధి వినాయక స్వామి, వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. యలమంచి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో కర్రి వీరాఘవరెడ్డి, వరలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి, సత్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ రొంగల పద్మావతి, అప్పాజీ, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు నల్లమిల్లి త్రినాథ్‌రెడ్డి, ఎంపీటీసీ తేతలి సుమ, ఉప సర్పంచ్ దార్వంపూడి వెంకట రామారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా సదస్యం

రంగంపేట: వడిశలేరులో శ్రీదేవి, భూదేవి సమేత భజేనారాయణస్వామి తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు సదస్యం నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన పండితుడు జొన్నాడ భట్టరు రవికృష్ణన్ ఆధ్వర్యంలో, ఆలయ అర్చకుడు చిలకమర్రి కృష్ణమాచార్యులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముమ్మన రాంబాబురెడ్డి, ధర్మకర్తల మండల మాజీ చైర్మన్ మావిరెడ్డి వీర్రాజు, ధర్మకర్త వల్లూరి సూర్యభాస్కరరావులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

వైభవంగా సత్తెమ్మ తల్లి జాతర

బిక్కవోలు: మోళ్లూరులో సత్తెమ్మ తల్లి జాతరను గురువారం నిర్వహించారు. అమ్మవారిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. సర్పంచ్ సాయిరాం, ఉప సర్పంచ్ కొమ్మన ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. కొంకుదురులోని బుడతలమామిడి వద్ద ఆంజనేయ స్వామివారి విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా ఉన్నారు.

పల్లెల ప్రగతికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- సంపరలో అభివృద్ధి పనులు ప్రారంభం



సంపరలో విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: పల్లెల ప్రగతికి ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం సంపర గ్రామంలో రూ.4.50 కోట్లతో నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్, రూ.1.56 కోట్లతో జల్ జీవన్ మిషన్ పథకంలో నిర్మించిన వాటర్ ట్యాంక్, ఆధునీకరించిన పైపులైన్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో రూ.6.06 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించామన్నారు. అలాగే ఇంతవరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం, విద్యుత్, తాగునీటి సౌకర్యం, నూతన సచివాలయం తదితర నిర్మాణాలు చేపట్టామన్నారు. చేసిన అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని ఆయన అభ్యర్థించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ టీవీఎస్ ఎన్‌మూర్తి మాట్లాడుతూ సబ్ స్టేషన్ ఏర్పాటుతో ప్రజలకు నాణ్యమైన నిరంతరం విద్యుత్ అందిస్తామన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు మాట్లాడుతూ ఈ విద్యుత్ సబ్ స్టేషన్ ద్వారా కాండ్రేగుల, పుట్టకొండ, చింతపల్లి, సంపర, శహపురం గ్రామాలకు లోఓల్టేజీ సమస్య తీరుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను, టీవీఎస్ మూర్తి తదితరులకు శాలువాలు వేసి ముక్తేశ్వరరావు సత్కరించారు. విద్యుత్‌శాఖ ఏఈ రవిచంద్ర, ఎంపీపీ కేతా తులసి, సర్పంచ్ అద్దంకి మాచరమ్మ, ఎంపీటీసీ సభ్యుడు ఎరుబండి శ్రీరామచంద్రమూర్తి, పార్టీ గ్రామ కన్వీనర్ యేరుబండి వెంకన్న, పుట్టకొండ సర్పంచ్ వల్లు వెంకటరమణ, ఉప సర్పంచ్ అద్దంకి బాబూరావు, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, తోట సాయిరామ్, రాయుడు సత్యవతి, అద్దంకి బాబులు, దిమ్మల బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభం

రంగంపేట: జి.దొంతమూరు, కోటపాడు గ్రామాల్లో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు పర్యటిస్తారని మండల పంచాయతీరాజ్ శాఖ జేఈ కె.శ్రీనివాసరావు తెలిపారు. జి.దొంతమూరులో రూ. 45 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, కోటపాడులో రూ. 23.94 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు.

నిస్వార్థ సేవలకు చిరునామా వలంటీర్లు



గాదరాడలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి, డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ

మధురపూడి: వలంటీర్లు సేవలకు చిరునామాగా నిలిచారని, జగనన్న ఆశయాలను అనుగుణంగా పనిచేస్తున్నారని కోరుకొండ ఎంపీపీ ఉల్లి వీర వెంకట సత్య సూర్యకుమారి అన్నారు. గాదరాడ సచివాలయంలో గురువారం వలంటీర్లకు సత్కారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ సూర్యకుమారి మాట్లాడుతూ పింఛన్లు, వివిధ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు సకాలంలో అందిస్తున్న వలంటీర్లు సేవా సారథులని కొనియాడారు. ఎమ్మెల్యే సతీమణి, డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ మాట్లాడుతూ నవరత్నాలను ప్రజలకు అందజేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న వలంటీర్లు అభినందనీయులన్నారు. వీరిపై కూడా ప్రతిపక్షాలు విమర్శలు చేయడం దారుణమన్నారు. అనంతరం 30 మంది వలంటీర్లను శాలువా, పూలమాలలు, సర్టిఫికెట్లతో సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి టి.రాజబాబు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు చీర్ల ఉమామహేశ్వరి, డ్వాక్రా మహిళా మహిళా సమాఖ్య మండలాధ్యక్షురాలు గొల్లవిల్లి అప్పలనర్స, వైఎస్సార్ నాయకుడు అరిబోలు చినబాబు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

రాజమహేంద్రవరం సిటీ: తెలంగాణ నుంచి రైలులో అక్రమంగా తరలిస్తున్న పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, రాజమహేంద్రవరానికి చెందిన జమ్ము పాపినాయుడిని అరెస్ట్ చేశామని జీఆర్పీ ఎస్సై మావుళ్లు తెలిపారు. రైల్వే స్టేషన్‌లో 2వ నంబర్ ప్లాట్‌ఫాం వద్ద గురువారం వీటిని పట్టుకున్నామన్నారు. మద్యం బాటిళ్ల విలువ రూ.2,050 ఉంటుందని వివరించారు.

డ్వాక్రా మహిళలు వ్యాపారవేత్తలు కావాలి

- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి
- బూరుగుపూడిలో సమావేశం



బూరుగుపూడిలో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: డ్వాక్రా మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడి సచివాలయం వద్ద గురువారం డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విజయలక్ష్మి మాట్లాడుతూ జగన్ పాలనలో స్వయం సహాయక సంఘాలు బలోపేతం అయ్యాయన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఇళ్ల స్థలాల పట్టాల నుంచి, వివిధ పథకాలను వారి పేరు మీదే అందజేస్తున్నారన్నారు. రాజానగరం నియోజకవర్గంలో 21,500 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశామన్నారు. అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నదే లక్ష్యమన్నారు. కానీ ప్రతిపక్షాలు దురుద్దేశంతో కోర్టులో కేసులు వేసి, పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా అడ్డుకుంటున్నాయన్నారు. బూరుగుపూడి, నిడిగట్ల, గాడాల గ్రామాలకు చెందిన పేదలకు నిడిగట్లలో స్థలాలిస్తే, కోర్టుకెళ్లి స్టే తీసుకొచ్చాయన్నారు. అనంతరం ఆమె మహిళలు ఘనంగా సత్కరించారు. సమావేశంలో వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు క్రొవ్విడి సత్రాజు, బూరుగుపూడి మాజీ సర్పంచ్ కంటే సత్తిబాబు, వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం జయంతి రాజ్, సెక్రటరీ తాతపూడి జాకబ్‌రాజు, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షులు మేకా నెహ్రూరాజు, నాయకుడు అడపా నరసింహమూర్తి పాల్గొన్నారు.

పల్స్‌పోలియో విజయవంతం చేయండి

రంగంపేట: పల్స్ పోలియో కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి బి.వేణుక్షలక్ష్మి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పలు శాఖల అధికారులతో సమావేశం జరిగింది. మార్చి 3, 4, 5వ తేదీల్లో జరిగే పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా మండలంలోని పీహెచ్‌సీ పరిధిలో 0–5 ఏళ్లలోపు పిల్లలు 4,685 మందికి 35 బూత్‌లలో పోలియో చుక్కలు వేయాలన్నారు. బూత్‌లలో వేయించుకోని పిల్లలకు ప్రతి ఇంటికి తిరిగి పోలియో చుక్కలు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ లతీఫ్ పాషా, ఎంఈఓ కె.శ్రీనివాసరావు, ఏఈ సీహెచ్ నాగేశ్వరరావు, సీహెచ్‌ఓ కె.జయమణి, ఎంపీహెచ్ఎస్ పి.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుల పరామర్శ



లక్ష్మీ సుజాత చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మధురపూడి: కోరుకొండ మండలం నర్సాపురం మాజీ ఎంపీటీసీ సభ్యుడు జ్యోతుల లక్ష్మీనారాయణను గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు మేడా గురుదత్త ప్రసాద్, రైతు విభాగం జిల్లా కార్యదర్శి మండపాక శ్రీను పరామర్శించారు. లక్ష్మీనారాయణ భార్య లక్ష్మీ సుజాత ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట పార్టీ స్థానిక నాయకులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు రేపు శంకుస్థాపన, ప్రారంభోత్సవం

సీతానగరం: మండలంలోని రఘుదేవపురంలో రూ.8 కోట్లతో నిర్మించే కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవన శంకుస్థాపన, సీతానగరంలోని ప్రభుత్వ హైస్కూల్లో రూ 2.45 కోట్లతో నిర్మించిన క్రీడా వికాస కేంద్ర (ఇండోర్ స్టేడియం) ప్రారంభోత్సవం శనివారం ఘనంగా జరగనున్నాయి. ఈ కార్యక్రమాలకు మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాతో కలిసి వీటిని ఆయన ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో ఆరోజు మధ్యాహ్నం 2.30 గంటలకు బొబ్బిల్లంక నుంచి సీతానగరం వరకూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు.

స్కౌట్ శిక్షణతో విద్యార్థుల్లో సేవాగుణం

- ఎంపీ భరత్‌రామ్
- పూర్తిస్థాయిలో రైల్వేస్టేషన్ అభివృద్ధి



నిర్వాహకులను అభినందిస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: విద్యార్థుల్లో క్రమశిక్షణ, ధైర్య సాహసాలు, సేవా గుణాన్ని పెంపొందించేందుకు స్కౌట్ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. సౌత్ సెంట్రల్ రైల్వే భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో గురువారం స్కౌట్ ఉద్యమ వ్యవస్థాపకుడు రాబర్ట్ బాడెన్ పావెల్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ పోటీలలో విజేతలైన స్కౌట్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేసి, అభినందించారు. ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ సమాజంలో పోలీసులు ప్రజలకు ఏ విధంగా సేవలందిస్తారో, అదే విధంగా విద్యార్థి దశ నుంచీ ఉత్సవాలు, జాతరలు, ఇతర కార్యక్రమాల్లో సేవలు అందించేందుకు స్కౌట్ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.260 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. తాను ఎంపీగా రైల్వే స్టేషన్లో 4, 5 ప్లాట్‌ఫాంలు తీసుకొచ్చానన్నారు. రాజమహేంద్రవరం విమానాశ్రయంలో రూ.355 కోట్లతో ఏ విధంగా అభివృద్ధి జరగనుందో, అదే మాదిరిగా రైల్వే స్టేషన్ కూడా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న రైల్వే ప్రధాన స్టేషన్ ముఖద్వారం ఐదుబళ్ల మార్కెట్ వద్దకు మారబోతోందన్నారు. ఈ నెలలోనే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారని ఎంపీ భరత్ తెలిపారు.

రచ్చబండలో పలువురి వినతులు

ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎంపీ మార్గాని భరత్‌రామ్ తెలిపారు. నగరంలోని ఎంపీ కార్యాలయంలో గురువారం రాజన్న రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. పలు నియోజక వర్గాల నుంచి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను వివరించారు. స్పందించిన ఎంపీ సంబంధిత అధికారులకు ఫోన్ చేసి, వాటిని పరిష్కరించాలని కోరారు.

సారా అమ్ముతున్న ఇద్దరు మహిళల అరెస్టు

కడియం: సారా అమ్ముతున్న ఇద్దరు మహిళలను అరెస్టు చేసి, వారి నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ తెలిపారు. దుళ్ల గ్రామానికి చెందిన తీగిరెడ్డి రమణను అరెస్టు చేసి, ఆమె నుంచి పది లీటర్లు, జేగురుపాడు పాములమెట్ట కాలనీకి చెందిన కారంకి లావణ్యను అరెస్టు చేసి, మరో పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరు పరిచామన్నారు. ఈ దాడిలో ఎస్సైలు కృష్ణసాయి, నాగదుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.